క్లుప్తంగా

ఘనంగా చండీ హోమం


చండీ హోమం చేస్తున్న అర్చకులు

చిల్లకూరు : మండల తీర ప్రాంతంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దొరువు కట్టకు చెందిన చిల్లకూరు దశరథరామిరెడ్డి, వెంకటేశ్వరమ్మ దంపతులు అమ్మవారికి సారె సమర్పించారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమలకు పూజలు చేసి హోమం గుండం వెలిగించారు. వేద పండితులు హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

వెంకటగిరి రూరల్ : మండలంలోని పంజాంలో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరి సబ్‌డివిజన్‌లోని రైతు గ్రూపులకు 80 శాతం రాయితీతో డ్రోన్లను పంపిణీ చేస్తామని తెలిపారు. ఎంపీపీ తనుజారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యప్రసాద్, ఏపీసీఎన్ఎఫ్‌డీపీఎం, ఏడీఏ పి.దశరథరామిరెడ్డి, ఏడీఏ నాగార్జున సాగర్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎస్‌కే షరీనా

చిల్లకూరు : రక్తదానం ప్రాణదానంతో సమానమని గూడూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్‌కే షరీనా తెలిపారు. ఆస్పత్రిలో బుధవారం రక్తదానంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు ఏపీఎస్‌ఏసీఎస్, ఎన్‌హెచ్‌ఎంలు సంయుక్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన, కాన్పు సమయంలో మహిళలకు రక్తం తక్కువ కావడం వల్ల ప్రాణాలు పోయే పరిస్థితులు ఉంటాయని తెలిపారు. వారికి రక్తం అందిస్తే బతుకుతారని వెల్లడించారు. ఆర్ఎంవో డాక్టర్ ప్రసూనా, బ్లడ్ బ్యాంకు అధికారి లక్ష్మీనారాయణ, సువర్ణకాంతం పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

పెళ్లకూరు/ఓజిలి: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ తెలిపారు. ఆమె బుధవారం పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాళెం వద్ద రూ.16.20 లక్షలతో నిర్మించిన రోడ్డు, పాలచ్చూరులో రూ.9 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, ఓజిలి మండలం కర్రబల్లవోలు నుంచి భట్టకనుపూరు మీదుగా అయ్యవారిపాళెం వరకు ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన పథకం కింద రూ.8.38 కోట్లతో నిర్మించిన సీసీ, బీటీ రోడ్లను ప్రారంభించారు.

ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయాలు


తనియాలి సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

దొరవారిసత్రం : మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఎప్పుడు విధులకు వస్తున్నారో తెలియని దుస్థితి నెలకొంది. వివిధ పనుల కోసం సచివాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సచివాలయాల్లో అరొకొరగా ఉన్న సిబ్బందికి అదనపు విధులు కేటాయించడంతో పనిభారం పెరిగింది. సర్వేల ముఖ్యంగా పేరుతో ఎక్కువ భాగం ఫీల్డ్‌లోనే ఉంటున్నారు. తనియాలి, ఏకొల్లు, మీజూరు, ఉచ్చూరు, తల్లంపాడు తదితర సచివాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడంతో ఉన్న సిబ్బంది కుంటి సాకులు చెబుతూ ఇష్టానూసారంగా వ్యవహరిస్తునే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

ఏడాదిగా అన్నింటా అక్రమాలే!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి ఆ పార్టీ నేతలు రెచ్చిపోతున్నారు. మమ్మల్ని ఆపే దమ్ము, ధైర్యం ఎవరికి ఉందని అధికార దుర్వినియోగానికి యథేచ్ఛగా పాల్పడుతున్నారు. సహజ వనరులను తమకు ఇష్టం వచ్చినట్టు దోచుకుంటున్నారు. ముఖ్యంగా ఇసుక, గ్రావెల్, మట్టి, తెల్ల రాయి, క్వార్ట్జ్‌ను అక్రమంగా తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

ఎల్లలు దాటుతున్న సహజ సంపద
- ఇసుక, సిలికా, మట్టి తవ్వకాలు
- అనుమతులు లేకుండా అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు


టిప్పర్లలో గ్రావెల్ పోస్తున్న హిటాచి

దొరవారిసత్రం మండలం పూలతోటమిట్టలో రాత్రివేళలో గ్రావెల్ తవ్వుతున్న హిటాచి


సైదాపురం : అనుమతులు లేకుండానే తెల్లరాయిని అక్రమ తవ్వకాలు తవ్వుతున్న జేసీబీ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లోని పలు మండలాల గుండా స్వర్ణముఖి నది ప్రవహిస్తోంది. ఇందులో నాణ్యమైన ఇసుక ఉండడంతో డిమాండ్ ఉంటోంది. దీన్ని ఆసరాగా తీసుకున్న కూటమి నేతలు జేసీబీలతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ముఖ్యంగా ఆంధ్రాకు చెందిన గ్రావెల్, ఇసుక, మట్టికి తమిళనాడులో మంచి డిమాండ్ వుంది. దీంతో కూటమి నేతలు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. తడ వద్ద సరిహద్దు చెక్‌పోస్టులో పోలీస్ అవుట్ పోస్టు వున్నప్పటికీ అధికార పార్టీకి చెందిన పెద్ద నాయకుల లారీలు కావడంతో వాళ్లే దగ్గరుండి సరిహద్దులు దాటిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.


పూలతోటమిట్ట ప్రాంతంలో గ్రావెల్ తవ్వుతున్న హిటాచి


గ్రావెల్ తవ్వేందుకు వెళుతున్న జేసీబీ, టిప్పర్ వాహనం

ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లోనూ తవ్వకాలు

గతంలో దొరవారిసత్రం మండలంలోని శ్రీధనమల్లి, మినమాలమూడి, చందనమూడి అటవీ ప్రాంతంలో, సూళ్లూరుపేట మండలంలోని ఇలుపూరు, మంగళంపాడు చెరువులు, మన్నారుపోలూరు మిట్ట ప్రాంతంలో గ్రావెల్ తవ్వేవారు. ప్రస్తుతం దొరవారిసత్రం మండలం పూలతోటమిట్ట రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 301 నుంచి 314లలో వున్న 80 ఎకరాల భూమిని 70 మంది రైతులకు పట్టాలు ఇచ్చారు. ఆ భూముల్లో ఎర్రటి జిగురు కలిగిన నాణ్యమైన గ్రావెల్ ఉంది. దానిపై కన్నేసిన కూటమి ప్రభుత్వ నాయకులు రైతులకు కొద్దోగొప్పో ముట్టజెప్పి రోజూ రాత్రిళ్లు హిటాచీలతో తవ్వుతున్నారు. 20, 30 టిప్పర్లు పెట్టి గ్రావెల్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. సుమారు 20 అడుగుల లోతు వరకు గ్రావెల్ తవ్వేయడంతో ఆ భూమి ఎందుకూ పనికి రాకుండా పోతోంది. అలాగే గూడూరు నియోజకవర్గంలోని చిట్టమూరు, నాయుడుపేట మండలంలోని సరిహద్దు ప్రాంతాల్లోని చెరువుల్లో యథేచ్ఛగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. సర్వముఖి నది నుంచి ఇసుక, చిల్లకూరు మండలంలోని పలు ప్రాంతాల నుంచి సిలికా ఇసుకను తరలిస్తున్నారు.



అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజం తరలింపు

వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం మండలంలో లభ్యమయ్యే క్వార్ట్జ్, మైకా క్వార్ట్జ్ ఖనిజానికి విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఇక్కడ మూడు కంపెనీలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. అనుమతి మేరకు కాకుండా ఇతర ప్రాంతాల్లో వున్న ఖనిజాన్ని రాత్రికి రాత్రే తవ్వి తరలిస్తున్నారు.


చిల్లకూరు : చెరువులో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న యంత్రాలు


సైదాపురం : అక్రమ మైనింగ్ చేస్తున్న యంత్రాలు


సైదాపురం : జోగిపల్లి సమీపంలో ఖనిజాన్ని ఇష్టాను సారంగా తవ్విన వైనం

ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు



కూటమి నేతల చర్యల వల్ల ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయాన్నిచ్చే మైనింగ్ పరిశ్రమ దివాలా తీసింది. గతంలో ప్రతి నెలా ప్రభుత్వానికి సుమారు రూ.15 కోట్ల రాయల్టీ రూపేనా ఆదాయం వచ్చేది. కూటమి నేతలు అక్రమంగా తరలిస్తుండడంతో ఆదాయం రావడంలేదు. వారికి అధికారులు వత్తాసు పలుకుతుండడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

\- బొలిగర్ల శివకుమార్, సైదాపురం

అక్రమ తవ్వకాలపై దృష్టి సారించాలి



అక్రమ మైనింగ్ తవ్వకాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. అనుమతులు లేకుండానే పలుచోట్ల అక్రమంగా తవ్వకాలు జరిపి యథేచ్ఛగా తరలిస్తున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడిపోతోంది. అక్రమ మైనింగ్ వల్ల తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

\- వరప్రసాద్, సైదాపురం

వైఎస్సార్ సీపీ బలోపేతమే ధ్యేయం

చిల్లకూరు : గూడూరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడంలో భాగంగానే సంస్థాగత కమిటీలను ఏర్పాటుచేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన బుధవారం తన నివాసంలో బుధవారం గూడూరు మున్సిపాలిటీలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గూడూరు మున్సిపాలిటీలోని వార్డుల్లో కమిటీలు ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. ఇందులో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ నాయకులు, కార్యకర్తలకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీల్లోనూ కమిటీలు ఏర్పాటుచేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

సాక్షి మీడియాపై దాడి హేయం

కూటమి నేతలు ఇటీవల సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం హేయమైన చర్య అని మేరిగ మురళీధర్ తెలిపారు. దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని తెలిపారు. సమావేశంలో గూడూరు ఎంపీపీ బూదరు గురవయ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువత కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్, సుజనా, దీప్తి, సుప్రియరెడ్డి, శ్రీధర్, పూర్ణచంద్ర, ఆల్తాఫ్, రఫీ, సుభాన్, బాబు, హషీమ్, మల్లికార్జున్, సురేష్‌రెడ్డి, శివకుమార్, ప్రేమ్ పాల్గొన్నారు.


కమిషనర్‌కు సమ్మె నోటీసు

చిల్లకూరు : గూడూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. వారు బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసు ఇచ్చారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు 2012లో ఇచ్చిన జీవో నంబర్ 11 ప్రకారం కేటగిరిలు నిర్ణయించి జీతాలు పెంచాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు పీఆర్‌సీ, జీతాలు కరువు భత్యం, ఐఆర్ చెల్లించాలని కోరారు. 2018లో ఆనాటి ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన సమాన పనికి సమాన జీతం ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు మృతి చెందితే దహన సంస్కారాలకు రూ.20 వేలు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దారా కోటేశ్వరరావు, బీవీరమణయ్య, పీ బాలజీ, ఎస్, గిరి, బీ మురళీ, ఏ ప్రసాద్, బీ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న సీఐటీయూ నాయకులు

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

దక్కిలి : వరి సాగులో తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వెంకటగిరి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ తెలిపారు. మండలంలోని వెంబులూరు పంచాయతీలో బుధవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వరిలో నూతన రకాలైన డీఆర్‌ఆర్ ధన్ 60, జింక్ బయో ఫోర్టిఫయిడ్ వరి రకం సాగుతో ఖర్చు తగ్గి అధిక దిగుబడి పొందడం వచ్చని వివరించారు. నిమ్మలో సమగ్ర పోషక యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. హైదరాబాద్ భారతీయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ మంగళదీప్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేసుకుని పంటలు సాగు చేస్తే ఖర్చులు తగ్గుతాయన్నారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కనుల పండువగా సీతారాముల కల్యాణం

కలువాయి(సైదాపురం) : మండలంలోని గార్లపాడులో బుధవారం సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం చేపట్టారు.


సీతారాముల గ్రామోత్సవం

పంపిణీకి పాఠ్య పుస్తకాలు సిద్ధం

నాయుడుపేట టౌన్ : పాఠశాలలు తెరిచిన రోజే పుస్తకాలు పంపిణీ చేయడానికి సిద్ధం చేసినట్టు ఎంఈవో మునిరత్నం తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ స్కూల్ యూనిఫామ్, బూట్లు ఇంకా రాలేదని తెలిపారు. సెలవులు పూర్తి కావడంతో గురువారం నుంచి పాఠశాలలు పనిచేస్తాయన్నారు. ఉదయం 9 గంటలకు అన్ని పాఠశాలలు ప్రారంభించాలని హెచ్ఎంలకు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. నాయుడుపేట మండలంలో 66 ప్రాథమిక, 9 ఉన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. 66 ప్రాథమిక పాఠశాలల్లో 17 పాఠశాలలను మోడల్ స్కూళ్లగా ఎంపిక చేసినట్టు వివరించారు.

పెంచలకోనలో శాస్త్రోక్తంగా జ్యేష్టాభిషేకం

రాపూరు: పెంచలకోనలోని పెనుశిలలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బుధవారం జ్యేష్టాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. జ్యేష్ఠ మాసం జ్యేష్టా నక్షత్రం, పౌర్ణమి, ఒకేరోజు వచ్చిన సందర్భంగా వైష్ణవాలయాల్లో హోమం, అభిషేకాలు నిర్వహించడం ఆచారమని ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి వెల్లడించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, అభిషేకం, పూలంగిసేవ, నరసింహ హోమం చేపట్టారు. 10 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో స్నపన పీఠంపై నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి 81 కలశాల ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ కలశాల్లోని జలాలతో స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లు తిరుచ్చిపై కొలువుదీరి కోనమాడ వీధుల్లో ఊరేగారు.


స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న అర్చకులు

పులి మృతికి కారణమేమిటో..?

కలువాయి(సైదాపురం) : మండలంలోని చింతల ఆత్మకూరులోని దక్షిణ కాలువలో మే 28న చిరుత పులి కళేబరం కొట్టుకువచ్చింది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. స్థానికులతో కలిసి కళేబరాన్ని వెలికి తీసి ఖననం చేశారు. చిరుత పులి మృతికి గల కారణాలను అధికారులు ఇప్పటి వరకు బయట పెట్టడం లేదు. పులి నీరు తాగేందుకు దక్షిణ కాలువలో దిగి మృత్యువాత పడిందా? లేక విద్యుత్ షాక్ గురై మృతిచెందిందా.. ఎవరైనా హత్యచేశారా అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


చిరుత పులి కళేబరం (ఫైల్)

అభివృద్ధి పనులు ప్రారంభం

సైదాపురం: మండలంలోని తుమ్మల తలుపూరు గ్రామంలో బుధవారం రూ.32 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం డీపీవో, నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎల్.శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ హరిత ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లోనూ సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఎంపీటీసీ శేషమ్మ, నేతలు సుబ్రమణ్యం నాయుడు, దిలీప్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కోట: మండలంలోని చెందోడు సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో దిలీప్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చెందోడు పరిసర గ్రామాల్లో ఎక్కువ మందికి ఆధార్ కార్డులు లేనట్టు గుర్తించామన్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆధార్ కార్డుల జారీతోపాటు తప్పుల సవరణ చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 37.954 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 37.954 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,300, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

రాపూరు: రాపూరులోని షాదీ మంజిల్‌లో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. నెల్లూరులోని అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని, కళ్ల అద్దాలు అందజేస్తామని తెలిపారు.

వాగులో బోల్తాపడిన కారు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని కోటూరుపల్లి జాతీయ రహదారిపై బుధవారం కారు అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పెంచలకోనకు చెందిన అర్చకుడు శేషు కుటుంబ సభ్యులతో కలిసి కారులో కనిగిరి నుంచి కలువాయి వైపు బయలుదేరారు. కోటూరుపల్లి జాతీయ రహదారిలో అదుపుతప్పి పక్కనే ఉన్న వాగులోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోడ్డులో వున్న గుంతలను తప్పించే క్రమంలో కారు అదుపుతప్పిందని క్షతగాత్రులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.